'గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దు'

గన్నేరువరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకలివానిపల్లి గ్రామంలో సర్వే నంబర్ 402లోని పల్లిబండపై గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వొద్దని గ్రామస్థులు తహశీల్దారు ఇప్ప నరేందర్‌కు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి 150 మీటర్ల దూరంలో ఉండే పల్లిబండకు గ్రానైట్ తవ్వకాల అనుమతులు ఇస్తే చుట్టూ ఉన్న పంటపొలాలు కలుషితమై దుమ్ముతో గ్రామస్థులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. గతంలో ఈ ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలకు ప్రయత్నాలు జరుగగా అడ్డుకున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం గ్రామ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే పల్లిబండను గ్రానైట్‌గా మార్చి తొలగించడానికి ఎలాంటి అనుమతులను జారీ చేయవద్దని తహసీల్దారును కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు బామండ్ల అనిల్, కూన యాదగిరి, నక్క తిరుపతి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలి

ఇల్లందకుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు సార్ల తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 26న జరిగే కేబినెట్ సమావేశంలో దీపావళి కానుకగా డీఏలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. పెరిగిన ధరల ప్రకారం 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ నివేదికను తెప్పించుకుని అమలు చేయాలని కోరారు.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.





ఇరుకుల్ల వద్ద ఏర్పాటు చేసిన దారి

దుర్శేడ్ శివారులో రైల్వే ట్రాక్ వద్ద జాతీయ రహదారి పనులు

జాతీయ రహదారి పనులు ముమ్మరం

- తుదిదశకు మానేరు వాగు వంతెన పనులు
- ఇరుకుల్ల వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం పనులు షురూ
- దారి మళ్లించేందుకు రహదారి ఏర్పాటు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ -563) నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం భారత మాల యోజన కింద 2,146 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 68కిలో మీటర్ల మేరకు ఫోర్‌లైన్ రోడ్డు నిర్మిస్తోంది. ఇందుకు 325.125 హెక్టార్ల భూసేకరణ పూర్తి చేసింది. కరీంనగర్ మండలం ఇరుకుల్ల, దుర్శేడ్ శివారులో బొమ్మకల్ మానేరు వాగు మీదుగా మానకొండూర్ వరకు రహదారి పనులు విస్తరంగా జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో బాగంగా మొత్తం 28 వెహికిల్ అండర్ పాస్ బ్రిడ్జిలు, ఇరుకుల్ల, మానేరు తదితర వాగులపై మొత్తం తొమ్మిది మేజర్ బ్రిడ్జిలను నిర్మించనున్నారు. బొమ్మకల్ మానేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఇరుకుల్ల వాగుపై 250 మీటర్లు, మానేరు వాగుపై 562 మీటర్ల పొడవుతో వంతెనలు నిర్మిస్తున్నారు. ఇరుకుల్ల గ్రామ ప్రధాన రహదారిపై ఫైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేస్తున్నారు. వాహనాలను మళ్లించేందుకు తారు రోడ్డును సిద్ధం చేస్తున్నారు.

భూ సేకరణ పూర్తయినా.. అందని పరిహారం

జాతీయ రహదారి నిర్మాణానికి రెండు సంవత్సరాల క్రితమే అధికారులు భూసేకరణ చేపట్టారు. పనులు జరుగుతున్నా నష్టపరిహారం అందించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ మండలంలో భూసేకరణ చేసిన గ్రామాల్లో దుర్శేడ్, ఇరుకుల్ల, ఎలబోతారం, నగునూర్, జూబ్లీనగర్ గ్రామాల రైతులకు సంబంధించిన వ్యవసాయ భూములను సేకరించారు. ఇరుకుల్లలో పూర్తి స్థాయిలో పరిహారం అందించినప్పటికి రహదారి నిర్మాణంలో భాగంగా

మిగతా 8వ పేజీలో... ..



:రేకుర్తిలోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌పూల్

నయా ట్రెండ్..

- ఫాంహౌస్‌ల్లో ఫంక్షన్లు
- కరీంనగర్‌లో పదుల సంఖ్యలో ఏర్పాటు
- స్విమ్మింగ్‌పూల్‌లు, రెయిన్ డ్యాన్స్‌లతో అధునాతన సౌకర్యాలు

◆ భగత్‌నగర్, ఆంధ్రజ్యోతి

7



ప్లాస్టిక్ అనర్థాలపై వేణుగోపాల్ ప్రచారం

సామాజిక వేణుగోపాల్

- ప్రకృతి... జంతువుల ప్రేమికుడు...
- రోడ్డుపై గుంతలు ఏర్పడితే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- ప్లాస్టిక్ అనర్థాలపై సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం
- హుజూరాబాద్‌లో 'నలుబాల'కు ప్రత్యేక గుర్తింపు

◆ హుజూరాబాద్, ఆంధ్రజ్యోతి

6



పత్తిని పరిశీలిస్తున్న అధికారులు.

సీసీఐ బోణీ

- మొదటిరోజు 11.7 క్వింటాళ్ల కొనుగోలు
- మద్దతు ధర రూ.7,270

◆ జమ్మికుంట, ఆంధ్రజ్యోతి

7

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు, కార్యకర్తలు

సుభాష్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఈనెల 27లోపు విడుదల చేయకపోతే చలో ఇందిరాపార్కు నిర్వహిస్తామని, సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రామరాపు వెంకటేష్, మచ్చ రమేశ్, మామిడిపల్లి హేమంత్, కేశబోయిన రాము, కనకం సాగర్, అద్దునూరి విష్ణు, కసిరెడ్డి సందీప్‌రెడ్డి, కౌశిక్, ఛత్రపతి, వినయ్, శ్రావణ్, ఈశ్వర్, రిషి పాల్గొన్నారు.

సీపీ అభిషేక్ మొహంతి రక్తదానం



రక్తదానం చేస్తున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని పరేడ్ గ్రౌండ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని సీపీ అభిషేక్ మొహంతి ప్రారంభించి సీపీ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన పోలీసు అమరవీరులను స్మరిస్తూ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. కమిషనరేట్‌లోని అన్ని విభాగాలకు చెందిన పోలీసు అధికారులతోపాటు శిక్షణ కానిస్టేబుళ్లు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారన్నారు. దాదాపు 200 మంది రక్తదానం చేశారని తెలిపారు. సేకరించిన ఈ రక్తాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(శాంతి భద్రతలు) ఎ లక్ష్మీనారాయణ, అడిషనల్ డీసీపీ (ఏఆర్) అనోక్ జయ్‌కుమార్, ఏసీపీలు విజయ్ కుమార్, మాధవి, నరేందర్, వెంకటరమణ, సీఐలు బిల్ల కోటేశ్వర్, విజయకుమార్, జాన్‌రెడ్డి, స్వామి, ప్రకాష్ గౌడ్, ఆర్‌ఐలు రజినీకాంత్, కుమార స్వామి, జానీమియా, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



క్రీడా పాఠశాల విద్యార్థులకు షూస్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 23: విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా రంగాల్లో రాణించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో గ్రంథాలయాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో క్రీడాకారులకు కొరత ఉందని, చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత ఉద్యోగాలు దక్కుతాయన్నారు. కష్టాన్ని నమ్ముకుని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. క్రీడా పాఠశాల విద్యార్థులకు ప్రతివారం తప్పనిసరిగా ఒక సందేశాత్మక సినిమా చూపించాలని అధికారులకు సూచించారు. త్వరలో క్రీడా పరికరాలు, దుస్తులు అందిస్తామన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ తక్కువ సమయంలో సమాజంలో గౌరవం సంపాదించాలంటే క్రీడల్లో రాణించడమే మార్గమని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, నెహ్రూ యువ కేంద్రం కో ఆర్డినేటర్ రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం లీలా ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



తిమ్మాపూర్ ఎంజేపీ పాఠశాలలో క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపులే గురుకు పాఠశాలలో జిల్లా స్థాయి క్రీడా పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సాధన చేస్తేనే క్రీడల్లో విజయాలను సొంతం చేసుకోవచ్చన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని తెలిపారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమిని హుందాగా స్వీకరించాలని సూచించారు. క్రీడల వల్ల మనలో నిబిడీకృతమైన శక్తి సామర్థ్యాలు బయటకు వస్తాయన్నారు. అందుకే విద్యార్థులు వ్యాయామంతో పాటు క్రీడలకు కొంత సమయం కేటాయించడమే కాకుండా తమకు ఇష్టమున్న క్రీడల్లో సాధన చేయాలని సూచించారు. గురుకులాల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఏదగాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఈ పోటీల్లో జిల్లాలోని 15 గురుకుల పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల ఆర్సీవో ఎం అంజలికుమారి, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ఆశిక్ పాషా పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 23: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు శాఖాధికారి పి కమలాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ రైతులకు భావితరాల పంట అని అన్నారు. ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను వివరించారు. కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో ఆయిల్‌ఫామ్ నర్సరీలను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం లోహియా ఎడిబుల్ ఆయిల్ ప్రైవేట్ కంపెనీ రీజినల్ మేనేజర్ భరత్ ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన పరిస్థితులు, దిగుబడి వచ్చే విధానం, మార్కెటింగ్ సౌకర్యం గురించి వివరించారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ఉద్యాన శాఖ అధికారి మంజువాణి, మండల వ్యవసాయాధికారి భూమిరెడ్డి, కంపెనీ సీఈవో సిద్ధాంత లోహియా, నర్సరీ మేనేజర్ హరీష్, ఫీల్డ్ ఆఫీసర్ వేణు పాల్గొన్నారు.

రైల్వే నిర్వాసితులతో గ్రామ సభ

గంగాధర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగరావుపల్లిలో రైల్వే లైన్ నిర్వాసితులతో ఆర్డీవో మహేశ్వర్ బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి, మనోహరబాద్ రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల వివరాలను ఆయన చదివి వినిపించారు. రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని ఎవరి పేరైనా, భూమి వివరాలైనా తప్పి ఉంటే తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వాసితులు తమకు పరిహారం త్వరగా అందించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, రైతులు పాల్గొన్నారు.

యజ్ఞ వరాహ క్షేత్రంలో డోలోత్సవం

- వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



యజ్ఞవరాహస్వామి ఆలయంలో డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 23: జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహ స్వామిక్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం హనుమద్వాహనంపై శ్రీవారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. శ్రీవారికి మహాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం డోలోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామి వారు ముత్యాల పందిరి వాహనంపై విహరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో బాగంగా అనుపమ హరిబాబు, ఎం శ్రీనిధి, భార్గవి రామకృష్ణ, వాణి భక్తి పాటలు, సంగెం రాధాకృష్ణ శిష్య బృందం నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో సర్వ వైదిక సంస్థానం ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ పాల్గొన్నారు. గురువారం ఉదయం సూర్యప్రభ వాహన, పూలంగి, అష్టదళపాదపద్మారాధన, అన్నకూటోత్సవం, సాయంత్రం మహాశాంతి హోమం, రాత్రి సహస్రదీపాలంకరణ, గజవాహనసేవలు జరుగనున్నాయి.

క్రైం కార్నర్

ఆస్తి తగదాలతో అన్నను చంపిన తమ్ముళ్లు

- ముగ్గురు నిందితుల అరెస్ట్



మాట్లాడుతున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గతంలో ఉన్న ఆస్తి తగదాలను మనసులో పెట్టుకుని సొంత అన్న అని చూడకుండా హత్య చేశారు ఇద్దరు తమ్ముళ్లు. మల్లాపూర్ మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో ఈ నెల 20న పల్లపు సాయిలు(36)ను హత్య చేసిన ముగ్గురు నిందితులను బుధవారం పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను మెట్‌పల్లి డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఉమామహేశ్వరరావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని తమ్ముళ్లు పల్లపు చందు, పల్లపు చిన్నితో పాటు గొల్ల సోయమ్మ అనే వారితో పల్లపు సాయిలుకు గత కొద్ది రోజులుగా భూ వివాదంతో పాటు ఇంటి స్థలం విషయంలో కొన్ని సంవత్సరాలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో గతంలో మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు కూడా జరిగాయి. ఈ క్రమంలో వ్యవహా రం ఎటు తెగకపోవడంతో కక్ష పెట్టుకున్న తమ్ముళ్లు మృతుడు పల్లపు సాయిలును ఎలాగైనా హత్య చేయాలని పథకం వేసారు. దీంతో పల్లపు సాయిలు ఒంటరిగా ఉన్న సమయాన్ని చూసి గొల్ల సోమయ్య, చందు, చిన్ని స్థానిక గోదావరి బ్రిడ్జి వద్దకు ద్విచక్ర వాహనంపై చేరుకున్నారు. ఆనంతరం గొడవపడి సాయిలును నెట్టివేయగా కిందపడిపోయాడు. వారి వెంట తెచ్చుకున్న తల్వార్‌తో మెడపై బలంగా నరికి హత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఆనంతరం ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. మృతుని భార్య నవ్య ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టగా బుధవారం మల్లాపూర్ శివారులోని కనకసోమేశ్వర గుడి వద్ద ఉన్నారనే సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకోని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి మూడు సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు, హత్యకు ఉపయోగించిన తల్వారును స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐలు చిరంజీవి, కిరణ్‌కుమార్, రాజులు పాల్గొన్నారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుని ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తున్న ఒరిస్సాకు చెందిన వెయిటర్ బనమాలి మాతాన్(54) లిఫ్ట్‌లో ఇరుక్కుని మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ముకరంపుర ప్రాంతానికి చెందిన ఒక హోటల్‌లో వెయిటర్‌గా పని చేస్తున్న మాతాన్ తాను నివాసం ఉంటున్న భవనంలో మొదటి అంతస్తు నుంచి పెంట్‌హౌస్‌కు వెళ్లే క్రమంలో లిఫ్ట్ హఠాత్తుగా కిందికి వెళ్ళడంతో అందులో ఇరుక్కున్నాడు. తీవ్రంగా గాయపడిన మాతాన్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లిఫ్ట్ సరైన నిర్వహణ లేకపోవడంతో ప్రమాదం జరిగినట్లు మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో ఇంటి యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డుపై వేసిన బోరు సీజ్

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణ పరిధిలోని పద్మశాలివీధికి చెందిన మహేందర్ అనే వ్యక్తి నడిరోడ్డుపై వేసిన బోరు వేయడంతో, సమాచారం అందుకున్న మున్సిపల్ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రోడ్లపైన బోర్లు వేస్తే చర్యలు తప్పవన్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన సహించేది లేదని హెచ్చరించారు. రోడ్డుపై బోరు వేసిన వ్యక్తిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిపివో శ్రీధర్, ఏఈ నరేష్, టిపిఎస్ ప్రదీప్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సదానందం, సిబ్బంది పాల్గొన్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన రాజేష్ అనే వ్యక్తి తనపై అత్యాచారం చేశాడని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడనిపై బుధవారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఫేస్‌బుక్‌లో తనకు పరిచయం అయిన సదరు మహిళ తనను ఉద్దేశ్యపూర్వకంగా డబ్బులు డిమాండ్ చేసిందని, ఇవ్వకుంటనే అత్యాచారం కేసు పెడుతానని బెదిరించిందని రాజేష్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేశామని పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరికి గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం చింతలపల్లి గ్రామ శివారులో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఒకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల మల్లయ్య తన వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా, లింగాపూర్-చింతలపల్లి గ్రామాల మధ్య గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మల్లయ్య కాలు విరిగింది. గమనించిన స్థానికులు 108 వాహనంకు సమాచారం అందించడంతో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆత్మహత్యకు కారణమైన ఒకరి రిమాండ్

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు కారణమైన సైదాపూర్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కేశవపట్నం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. సైదాపూర్ మండలం సోమారం గ్రామానికి చెందిన సుంకరి చందర్ తండ్రి సారయ్యకు చెందిన వ్యవసాయ భూమిలో ఒక ఎకరం భూమిని అవసర నిమిత్తం అదే గ్రామానికి చెందిన పేరుమడ్ల రాజబాబుకు అమ్మాడు. రాజబాబు అక్రమంగా ఎకరం భూమికి బదులు మూడెకరాల భూమిని పట్టా చేయించుకున్నాడు. ఈ విషయం చందర్ తండ్రి సారయ్యకు తెలిసి వీరి మధ్య పలుమార్లు పంచాయతీ జరిగింది. అప్పటికి కూడా భూమిని తిరిగి తన తండ్రి సారయ్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తన తండ్రి తీవ్ర మనస్తాపం చెంది కేశవపట్నం పొలిమెరలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకన్నాడు. గతంలో సుంకరి చందర్ కేశవపట్నం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపి పేరుమడ్ల రాజబాబును రిమాండ్‌కు తరలించినట్లు కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

పేదరికంతో బిడ్డను విక్రయించిన తల్లిదండ్రులు

- తిరిగి ఇప్పించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరికం ఆ తల్లిదండ్రులు బిడ్డను అమ్ముకునేలా చేసింది. తొలుత విక్రయించినా తిరిగి తమ బిడ్డను తమకు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బుధవారం చోటు చేసుకున్న సంఘటన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన శ్యామల, రవీందర్ దంపతులు 15 సంవత్సరాలుగా రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నారు. దంపతులకు ఐదుగురు ఆడ పిల్లలు సంతానం. పేదరికంతో పిల్లలను పోషించలేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్న పాపను విక్రయించాలని నిర్ణయించుకున్నారు. తమకు పరిచయమున్న జగిత్యాల జిల్లా గోవిందులపల్లి గ్రామానికి చెందిన లక్ష్మికి తమ పాపను అమ్ముతామని ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో మంగళవారం తల్లిదండ్రులు ఇద్దరు లక్ష్మికి పాపను విక్రయించి కాగితం రాసుకున్నారు. బుధవారం శ్యామల తమ పాపను తిరిగి ఇప్పించాలని వేములవాడ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు లక్ష్మిని విచారించగా రూ.90 వేలకు పాపను తనకు విక్రయించారని తెలిపింది. అనంతరం పాపను పోలీసులు శ్యామలకు అప్పగించారు.

సామాజిక వేణుగోపాల్

- ప్రకృతి... జంతువుల ప్రేమికుడు...
- రోడ్డుపై గుంతలు ఏర్పడితే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- ప్లాస్టిక్ అనర్థాలపై సైకిల్‌పై తిరుగుతూ ప్రచారం
- హుజూరాబాద్‌లో 'నలుబాల'కు ప్రత్యేక గుర్తింపు

రోడ్డుపై గుంతలు పడ్డాయా.. నలుబాల వేణుగోపాల్ అక్కడికి వస్తాడు. ఎర్ర జెండా ఏర్పాటు చేసి వాహనదారులను దారి మళ్లిస్తాడు.. ఏవైనా జంతువులు చనిపోయాయా.. వేణుగోపాల్ అక్కడికి వచ్చి వాటి కళేబరాలను అక్కడి నుంచి పట్టణానికి దూరంగా తీసుకెళ్లి పూడ్చిపెడతాడు.. ఇలా 25 ఏళ్లుగా హుజూరాబాద్‌లో సామాజిక కార్యక్రమాలకు చిరునామాగా మారారు నలుబాల వేణుగోపాల్. వృతి రీత్యా ఆర్కిటెక్ట్ అయిన వేణుగోపాల్ సామాజిక రుగ్మతలపై యుద్ధం చేస్తున్నాడు. ఆయన వాహనంపై 108 అని రాసుకున్నాడు. ఇలా ఎందుకు అని అడిగితే ఎవరికి ఏ అవసరం వచ్చినా తాను 108లా అక్కడి వచ్చి సహాయం చేస్తానని చెబుతాడు.

ఆదర్శం



ప్లాస్టిక్ సంచులు వాడవద్దంటూ సైకిల్‌పై తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న వేణుగోపాల్

హుజూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయన ప్రకృతి.. జంతువుల ప్రేమికుడు... రోడ్లపై గుంతలు పడితే సమస్య పరిష్కరించేంత వరకు హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో పాటు అధికారులను పిలిపించి మరమ్మతులు చేయిస్తాడు. ప్లాస్టిక్ సంచులు వాడవద్దని కూరగాయాల మార్కెట్‌కు వెళ్లి అవగాహన కల్పించడంతో పాటు బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. సామాజిక కార్యక్రమాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు హుజూరాబాద్‌కు చెందిన నలుబాల వేణుగోపాల్. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఆర్కిటెక్ట్ వేణుగోపాల్ వృతిరీత్యా భవనాలకు ప్లానింగ్ చేస్తూ సివిల్ ఇంజినీర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. సామాజిక రుగ్మతలను నిర్మూలిస్తూ ఒక సైన్యంలా పనిచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. రోడ్డు పక్కన కోతులు, కుక్కలు, పందులు చనిపోయి ఉంటే వాటిన తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అంత్యక్రియలు చేయడం ఆయనకు అలవాటు. కోతులు, కుక్కలతో స్నేహం పెంచుకొని వాటికి ఆహారాన్ని అందిస్తారు. ఎవరైనా అనాథలుగా చనిపోతే వారి మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తాడు. రోడ్లపై గుంతలు పడితే అక్కడ ఎర్ర జెండాతో వాలిపోయి వాహనదారులను దారి మళ్లిస్తాడు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని కూరగాయల మార్కెట్‌కు వెళ్లి బట్ట సంచులను ఉచితంగా అందజేస్తాడు. పర్యావరణాన్ని కాపాడాలంటే మొక్కలు నాటాలని సైకిల్‌పై తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు మొక్కలు నాటుతారు. రోడ్లపై చెత్త ఉంటే స్వచ్ఛభారత్‌లో భాగంగా శుభ్రం చేస్తాడు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేస్తాడు. ప్రభుత్వాధికారుల పనితీరును, సంక్షేమ పథకాలల్లో అవినీతి అక్రమాలను ప్రశ్నించడం ఈయన నైజం. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు వేణుగోపాల్ కలెక్టర్ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పలు అవార్డులు అందుకున్నారు.

● ఆయన ఒక 108...

వేణుగోపాల్ ద్విచక్ర వాహనానికి 108 అని రాసి ఉంటుంది. ఆయనకు ఎవరైనా ఫోన్ చేసి ఇక్కడ ఒక సమస్య ఉందంటే వెంటనే వాలిపోతారు. షోవోలిన్, కుంగ్‌ఫూ, కరాటేలో జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన ఆయన 25ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో పాలుపంచు కుంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో పారిశుధ్యం అమలు కాకుంటే ఎప్పటికప్పుడు అధికారులను అప్ర మత్తం చేస్తుంటాడు. ఆస్పత్రుల్లో పేద రోగులకు ఉచితం గా మందులు పంపిణీ చేస్తూ వారి యోగక్షేమాలను చూసుకుంటారు. చేతనైనంత సాయం చేయడంలో అసలైన తృప్తి ఉందని అందుకే ఇవన్నీ చేసున్నానని, ఎవరేమనుకున్నా తనకు సంబంధం లేదని ఎప్పుడు చెబుతుంటాడు.



హుజూరాబాద్‌లో మొక్కలు నాటుతున్న నలుబాల వేణుగోపాల్

● విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు చేయాలనే ఆలోచన

విద్యార్థి దశ నుంచే సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. 25 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నాను. సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలనే ఉద్దేశ్యంతో వివిధ కార్యక్రమాలు చేస్తున్నాను. ఇక ముందూ చేస్తూ ఉంటాను. నా సంపాదనలో కొంత మేర ప్రజలకు ఉపయోగిస్తాను.

- నలుబాల వేణుగోపాల్, సామాజిక కార్యకర్త, హుజూరాబాద్



న్యూస్ బాక్స్

అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా శ్రీరాములు నియామకం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గోనికొండ శ్రీరాములు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో సామాజిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఈ మేరకు యూనివర్సిటీలో విభాగాధిపతి నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. పోస్టుకు ఎంపిక కావడంపై స్థానికులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది తాత్కాలిక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో బోధించేందుకు ఆసక్తి అర్హత కలిగిన వారు ఈనెల 26వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

అధికారుల దాడులు

గంగాధర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్శకుర్తిలో ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మరగ్గాలపై రంగుల వస్త్రాలు తయారు చేస్తున్న లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. చెన్నయ్ నుంచి వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు, జిల్లా జౌళిశాఖ అధికారులు దాడిలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముత్తారం అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన ఓల్లెపు మొగిలి ఇంట్లో నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం పట్టుకున్నారు. అక్రమంగా నిలువ ఉంచిన బియ్యాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్లో మొగిలిపై సివిల్ సప్లై అధికారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వద్ద తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొని ఇతర ప్రదే శాలకు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో స్థానిక పోలీసుల సహాయంతో సివిల్ సప్లై అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు ఈ మేరకు మొగిలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

అదుపు తప్పిన వాహనాలు

- రోడ్డు పక్క షెడ్, దుకాణాల్లోకి దూసుకుపోయిన కంటైనర్, కారు

- ఆస్తి నష్టం... పోలీసులకు ఫిర్యాదు



షెడ్‌ను ఢీకొట్టిన కంటైనర్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23: రోడ్డుపై వెళ్లాల్సిన వాహనాలు అదుపుతప్పి పక్కన దుకాణాలు, టీ కొట్టుల్లోకి దూసుకుపోతున్నాయి. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపటం మూలంగానే ఈ ప్రమాద ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. 12 గంటల వ్యవధిలో కరీంనగర్‌లో రెండు సంఘటనలు చోటుచేసుకోగా అదృష్టవత్తు ఎవరూ గాయపడనప్పటికీ ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ మానేరు బైపాస్‌రోడ్‌లో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో శివానగర్ వ్యాన్‌ల అడ్డా వద్ద ఒక భారీ కంటైనర్ పద్మనగర్ వైపు నుంచి బైపాస్‌రోడ్ గుండా విశాఖపట్నంకు వెళుతూ రోడ్డు పక్కన టీ షాపు షెడ్‌లోకి దూసుకుపోయింది. దీంతో షెడ్ కూలిపోగా, అందులోని ఫర్నిచర్, బైక్, కారు ధ్వంసమయ్యాయి. సుమారు 3.5 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని టీ షాపు యజమాని నర్సయ్య రెండో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. కంటైనర్ డ్రైవర్‌తో పాటు మరొకరిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. సంఘటనా స్థలంలో వీధిదీపాలు లేకపోవటంతో పాటు చీకట్లో డ్రైవర్ మత్తులో ఉండి అతివేగంగా నడపటంతో అదుపుతప్పి షెడ్‌ను ఢీకొట్టిందని స్థానికులు తెలిపారు. బుధవారం ఉదయం 8:30 గంటల ప్రాంతరంలో తిరుమల్‌నగర్‌లో అంబేద్కర్ స్టేడియం చౌరస్తాలో ఒక కారు అదుపుతప్పి రోడ్డు పక్కన కిరాణంషాపులోకి దూసుకుపోయింది. షాపులోని వస్తువులు కొన్ని ధ్వంసమై నష్టం వాటిల్లినట్లు స్థానికులు తెలిపారు. ఎదురుగా స్కూల్ వ్యాన్ వస్తుండగా తప్పించబోగా అదుపుతప్పి కిరాణం షాపులోకి దూసుకుపోయిందని తెలిపారు. కారును నడుపుతున్న వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు.



ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

చందుర్తి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి గోడ విషయంలో మహిళపై దాడికి చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన బొజ్జగట్టు వసంతతో బొజ్జగట్టు మోహన్‌కు ఇంటి పక్కన భూమి విషయంలో గొడవలు జరిగాయి. 16 ఆగస్టు 2014న వసంత ఇంటికి వెళ్లే దారికి అడ్డంగా మోహన్ గోడ నిర్మిస్తుండగా అడ్డుకున్న వసంతను దూషించడంతోపాటు కొట్టాడు. ఈ మేరకు బాధితురాలు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి మోహన్‌కు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో 11 మందికి గాయాలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 23: సిరిసిల్ల పట్టణంలో రగుడు బైపాస్ రహదారిపై బుధవారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. మెదక్ జిల్లా రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ కుటుంబ సభ్యులతో వేములవాడలో పెళ్లి చూపులకు కోసం బయలుదేరారు. సిరిసిల్ల పట్టణం చంద్రంపేట బైపాస్ తర్వాత రగుడు పాఠశాల వద్దకు చేరుకున్నారు. ఆ మార్గంలో రహదారిపై ధాన్యం ఆరబోయడంతో రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో రూట్ మార్చుకొని వన్‌వేలో వెళ్తుండగా యూటర్న్ చేసుకొని అతివేగంగా వస్తున్న చందుర్తి మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన మరో కారు ఎదుగా ఢీకొంది. దీంతో మహ్మద్ గౌస్ కారు అదుపు తప్పి ఎగిరి కల్వర్టు కిందపడింది. అందులో ప్రయాణిస్తున్న ఎమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. మరో కారు డి వైడర్‌కు ఢీకొట్టి ఆగిపోయింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితులను స్థానికులు కారు నుంచి బయటకు తీసి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. దసరా పండుగ రోజున ఇదే మార్గంలో చంద్రంపేటకు చెందిన వేముల శేఖర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బైపాస్ రహదారిపై ధాన్యం ఆరబోయడం, కల్వర్టు నిర్మాణంలో ఉండడం, రోడ్డుపై అక్కడక్కడ నిర్మాణం పూర్తి కాకపోవడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

సుల్తానాబాద్, ఆక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించారు. ఎలిగేడు మండలంలోని నారాయణరావుపల్లి గ్రామానికి చెందిన కరివేద రవీందర్‌రెడ్డి(38) అనే యువకుడు కరీంనగర్ నుంచి రాత్రి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాంగ్ రూట్లో ఎదురుగా వచ్చిన ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రవీందర్‌రెడ్డి సంఘటన స్థలంలోనే మృతిచెందాడరని ఎస్‌ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం అనంతరం మృతదేహాన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బుధవారం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు కరీంనగరలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడని, ప్రతీ రోజు స్వగ్రామం నుంచి రాకపోకలు సాగిస్తుంటాడని తెలిసింది.

ఎన్టీపీసీలో ఒకరి దుర్మరణం

జ్యోతినగర్, అక్టోబరు 23: ఎన్టీపీసీ బీ టైపు గేటు సమీప రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహ్మద్ ఖలీం(38) అనే దివ్యాంగుడు మృతిచెందాడు. గోదావరిఖని నుంచి తన స్కూటీపై రామగుండం వైపు వెళ్తున్నాడు. ముందుగా వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా రోడ్డుపై ఆపడంతో వెనుకనే వస్తున్న ఖలీం వాహనం ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా చనిపోయాడు. ఖలీం స్వగ్రామం పెద్దపల్లి మండలం హన్మంతునిపేట. గోదావరిఖనిలోని మైనార్టీ గురుకులంలో ఔట్ సోర్సింగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని హన్మంతునిపేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఎన్టీపీసీ ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అనుపురంలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. వేములవాడ మండలం అనుపురంలోని ప్రధాన రహదారిని ఆనుకొని చెట్ల పొదల్లో సుమారు 50 సంవత్సరాల వయస్సుగల పురుషుడి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురికి తరలించారు.

రైస్ మిల్లుల కేంద్రంగా మానకొండూర్

● వివిధ రాష్ట్రాల కూలీలకు ఉపాధి



మానకొండూర్‌లో కూలీలకు ఉపాధీ కల్పిస్తున్న రైసుమిల్లు

మానకొండూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఉమ్మడి జిల్లా వ్యవసాయ ముఖ చిత్రాన్ని మార్చింది. ఎస్సారెస్పీ నీటితో భూములన్నీ సస్యశ్యామలమయ్యాయి. మానకొండూర్ ప్రాంతంలో వరి సాగు పెద్ద ఎత్తున్న పెరిగింది. ఇక్కడి నుంచి రోడ్డు సౌకర్యం ఉండడంతో మానకొండూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో రైస్‌మిల్లులు వెలిశాయి. 40ఏళ్ల క్రితం మొట్టమొదటి రైస్ మిల్లును ఇక్కడ ఏర్పాటు చేశారు. మిల్లుల ఏర్పాటుతో స్థానికంగా ఉండే ప్రజలకు ఉపాధి లభించింది. క్రమక్రమంగా రైస్ మిల్లుల సంఖ్య పెరగడంతో ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు ఉపాధి కోసం రావడం ప్రారంభమైంది. మానకొండూర్, సదాశివపల్లి గ్రామాల్లో 40కిపైగా రైసుమిల్లులు కొనసాగుతున్నాయి. దాదాపు 1200 మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. కూలీలకు ఉపాధి కల్పించడంతో పాటు వరి ధాన్యం సేకరించి ఇతర రాష్ట్రాలతో పాటు రాష్ట్రప్రభుత్వానికి సీఎంఆర్ రైస్ అందిస్తూ ఉమ్మడి జిల్లాలో మానకొండూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారికి పక్కన ఉన్న రైసు మిల్లులు జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నాయి. మిల్ ఆపరేటర్లు, మెకానిక్‌లు, లారీ డ్రైవర్లు కూలీలు ఇలా పలు రంగాల్లో ఉపాధి పొందుతున్నారు. పొట్ట చేతపట్టుకొని వందల కిలోమీటర్ల నుంచి జీవనోపాధి కోసం భార్యాపిల్లలతో వచ్చిన కూలీలకు మిల్లుల యజమానులు వసతి కల్పిస్తున్నారు. ఒకప్పుడు రైస్ మిల్లులతోనే గుర్తింపు పొందిన ఈ ప్రాంతంలో ఇతర వ్యాపారాలూ ఊపందుకున్నాయి.

గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించిందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసినకరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. ఎమ్మెల్యేను ప్రిన్సిపాల్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశం, మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకులాల జిల్లా కన్వీనర్ మణిదీప్తి, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సాయిరి మహేందర్, చిలుక సతీష్, జానీ, చిన్నయ్య, గుజ్జేటి వెంకన్న, విజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానేరు వంతెన రెండు జిల్లాలకు వరం లాంటిది

ఓదెల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రూపునారాయణపేట మానేరువాగుపై వంతెన సౌకర్యం పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు వరం లాంటిదని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం రూపునారాయణపేట సమీపంలోని మానేరు వాగుపై మంజూరైన వంతెన నిర్మాణ ప్రాంతాన్ని ఎమ్మెల్యే విజయరమణారావు, ఆర్‌అండ్‌బీ ఈఈ, జేఈలతో కలిసి సందర్శించారు. ఓదెల మండలం రూపునారాయణపేట, మానేరు వాగు నుంచి జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మీదుగా నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించి అంచనా వ్యయాన్ని సమీక్షించారు. గ్రామాల్లో వెడల్పు, వంతెన పొడవులపై చర్చించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన నిర్మాణమైతే రైతులకు జమ్మికుంటలోని మార్కెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం రూ. 80 కోట్లు కేటాయించగా, అదనంగా ఎన్ని కోట్ల నిధులైనా కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అంతకుముందు గుంపుల నుంచి జమ్మికుంట వైపు వెళ్లే ప్రధాన రహదారి ధ్వంసం కావడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, అంకం రమేష్, బోడకుంట స్వామి, బొంగోని శ్రీనివాస్, ఆకుల మహేందర్, పడాల రాజు, సిరిసేటి రాహుల్, రెడ్డి రజనీకాంత్, కోట నిరంజన్ రెడ్డి, నీర్ల శ్రీనివాస్, చింతం కుమారస్వామి, నాగపూరి రవి గౌడ్, చీకట్ల ముండయ్య, సంద మహేందర్, తిప్పారపు సంపత్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో 150 మంది విద్యార్థులు



బస్సులో విద్యార్థులు

మల్యాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో గల నూకపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ బస్సుల్లో వందలాదిగా ఇబ్బందుల మధ్య ప్రయాణిస్తున్నారు. ఈ స్కూల్‌కు మండలంలోని పలు గ్రామాల నుంచి వందలాదిగా విద్యార్థులు వస్తూంటారు. అయితే వీరందరి కోసం జగిత్యాల డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు ఒక్కో ట్రిప్ ద్వారా విద్యార్థులను స్కూల్‌కు చేరవేస్తుంటాయి. అయితే బస్సులో 60 మంది లోపే ప్రయాణించే అవకాశం ఉండగా నిత్యం 150 మందికి పైగా విద్యార్థులు ప్రమాదపుటంచున ప్రయాణిస్తున్నారు. బుధవారం బస్ పాస్ లేని వారే 140 మంది ఉన్నట్లు తెలిసింది. దీంతో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ ప్రజా ప్రతినిధులు, ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. రెండు బస్సులను రెండు ట్రిప్పుల చొప్పున నడపాలని కోరుతున్నారు

నయా ట్రెండ్..



మల్కాపూర్‌లోని ఫాంహౌస్‌లో స్విమ్మింగ్‌పూల్ లోపలి భాగం

"ప్రస్తుతం ఫంక్షన్ల నిర్వహణలో కొత్త ట్రెండ్ నడుస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం ఫాంహౌస్ కల్చర్ నడుస్తోంది. గెట్‌టు గెదర్‌లు మొదలుకొని హల్దీ, సంగీత్ ఇలా రకరకాల ఫంక్షన్లను ఫాంహౌస్‌ల్లో నిర్వహిస్తున్నారు. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. ఈ ఫాంహౌలక్ష రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, స్విమ్మింగ్ పూల్, ఓపెన్ కిచెన్, నైట్ ఫైర్, ఫొటో షూట్ వంటి అధునాతన సౌకర్యాలు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో ఫంక్షన్లు చేసుకునే అవకాశం ఉంది. నిర్వాహకులు అందుబాటు ధరల్లో అన్ని వసతులు కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఫాంహౌస్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు."

- ఫాంహౌస్‌ల్లో ఫంక్షన్లు
- కరీంనగర్‌లో పదుల సంఖ్యలో ఏర్పాటు
- స్విమ్మింగ్‌పూల్‌లు, రెయిన్ డ్యాన్స్‌లతో అధునాతన సౌకర్యాలు

భగత్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫాంహౌస్ కల్చర్ రోజురోజుకు పెరిగిపోతోంది. కరీంనగర్ పరిసరాల్లో పదుల సంఖ్యలో ఫాంహౌస్‌లు వెలిశాయి. తమ ఫంక్షన్లను ఫాంహౌస్‌లలో నిర్వహించురకునేందుకు ప్రజలు ఇష్టపడుతున్నారు. కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, రేకుర్తి, చింతకుంట, కమాన్‌పూర్‌తోపాటు కరీంనగర్ రూరల్ మండలంలోని నగునూరు సమీపంలో ఫాంహౌస్‌లు నిర్మించారు. ఆహ్లాదకర వాతావరణం, ఆత్మీయుల మధ్య పార్టీలను ఫాంహౌస్‌లలో చేసుకోవాడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు.



ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన రెయిన్‌బాత్ స్టేజి, ఈఫిల్ టవర్ నమూనా

అత్యాధునిక వసతులు

ఫాంహౌస్‌ల్లో అత్యాధునిక వసతులు కల్పిస్తున్నారు. ఏసీ రూంలు, వైఫై సదుపాయం, వాష్ రూంల్లో గీజర్ ఏర్పాటు చేస్తున్నారు. సూట్ రూంలు అందుబాటులో ఉంటున్నాయి. ఆహ్లాదకరమైన గార్డెనింగ్, పెళ్లికి కావాల్సిన సంప్రదాయ వస్తువులు, సంగీత్ కార్యక్రమానికి అవసరమైన వసతులతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో పెళ్లిల్లో వాడే వస్తువులు, ఎడ్లబండ్లు, చేద బావితో పాటు అన్ని వస్తువులను ఫాంహౌస్‌లలో సమకూరుస్తున్నారు. రెయిన్‌డ్యాన్స్ స్టేజీ, కిచన్‌తోపాటు, ప్రైవేట్ కిచెన్‌లను అందుబాటులో ఉంచుతున్నారు. ఫ్యామిలీలు ఉండడానికి వసతి సదుపాయం, ప్రైవేట్ స్విమ్మింగ్ పూల్, నైట్‌ఫైర్, ప్రొజెక్టర్, ఫొటో షూట్ కోసం అనువైన వాతావరణాన్ని సమకూరుస్తున్నారు. అన్ని ఫాంహౌస్‌లలో వాహనాలు పార్కింగ్ చేయడానికి ప్రత్యేక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.

అన్ని రకాల ఈవెంట్స్‌కు అనుకూలం

ఫాంహౌస్‌ల్లో అన్నిరకాల ఈవెంట్స్ చేసుకోవడానికి వసతులు కల్పిస్తున్నారు. పెళ్లికి ముందు సంగీత్, హల్దీ వేడుకలు, బ్రైడ్‌గ్రూమ్ సెర్మన్, డెస్టినేషన్ వెడ్డింగ్, రిసెప్షన్ పార్టీలు, ఫ్యామిలీ ఔటింగ్‌లు, గెట్ టు గెదర్‌లు, బర్త్ డే పార్టీలు, రిటైర్‌మెంట్ ఫంక్షన్స్, బ్యాచ్‌లర్ పార్టీస్, సర్‌ప్రైస్ పార్టీలు, కార్పొరేట్ ఈవెంట్స్, కిట్టీ పార్టీలు, ఫొటో షూట్‌లు మొదలుకొని ఆత్మీయ సమ్మేళనాలు ఇలా ఏ సెలబ్రేషన్స్ అయినా ఫాంహౌస్‌లలో నిర్వహించుకోవచ్చు.



మల్కాపూర్‌లోని ఫాంహౌస్‌లో ఏర్పాటు చేసిన ఊయల

అందుబాటులో ధరలు

ఫాంహౌస్‌లలో చిన్న కార్యక్రమాలతోపాటు పెద్ద పార్టీలు నిర్వహించడానికి ధరలు అందుబాటులో ఉండడంతో ఈవెంట్స్ చేసుకోవడానికి నగరవాసులు ఇష్టపడుతున్నారు. ఫాంహౌస్‌లో ఉన్న వసతులను బట్టి ఎనిమిది వేల రూపాయల నుంచి ఇరవైవేల రూపాయల వరకు ధరలు నిర్ణయించారు. పది మంది సభ్యుల నుంచి మొదలుకుని వందల సంఖ్యలో కార్య క్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫాంహౌస్‌ల్లో వసతులు కల్పించారు. కొన్ని ఫాంహౌస్‌ల్లో విద్యుత్ అంతరాయం లేకుండా బ్యాకప్ సదుపాయం కూడా కల్పించారు.

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం..



అన్ని ఫంక్షన్లకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తు న్నాం. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందుబాటు ధరలోనే ఫాం హౌస్ లభిస్తుండడంతో ప్రజలు ఆదరిస్తున్నారు.

- శ్రవణ్, ఆర్‌కే రిసార్ట్స్ యజమాని





ఫాంహౌస్‌లో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన ఈవెంట్‌లు

4 నుంచి ఎంఎడ్ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలోని ఎంఎడ్ నాలుగో సెమిస్టర్ పరీక్షలు నవంబరు4 నుంచి, రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 5 నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయం త్రం ఐదు గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం యూనివర్సిటీ www satavahana.ac.inలో సందర్శించాలని సూచించారు.

●ఎస్‌యూ పరిధిలోని ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం రెండో సెమిస్టర్ పరీక్షలు నవంబరు 4 నుంచి ప్రారంభం అవుతాయని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన ఎస్‌యూ వీసీ

గణేశ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ బుధవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశంతో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా శాతవాహన యూనివర్సిటీ చేపట్టబోయే రెండో కాన్వకేషన్‌కు ముఖ్య అతిథిగా రావాలని గవర్నర్‌ను కోరగా ఆయన సానుకులంగా స్పందించారని వీసీ ఉమేశ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని గవర్నర్ సూచించారన్నారు.

ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో రుణాలు ఇప్పిస్తామని 12 మందిని మోసం చేసిన కముటం మౌనిక, కందుకూరి శ్రీధర్‌చారిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలం సదాశివపల్లి గ్రామానికి చెందిన మౌనిక భర్తతో విడిపోయి కరీంనగర్‌లో ఉంటోంది. ఇదే సమయంలో శ్రీధర్‌చారితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు కలిసి మౌనిక తల్లిగారి గ్రామమైన పెద్దలింగాపూర్‌కు చేరుకొని శ్రీధర్‌ను బ్యాంకు అధికారిగా పరిచయం చేసింది. కేంద్రప్రభుత్వ పథకం ముద్ర యోజన కింద ఒక్కొక్కరికి రూ.10లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మబలికింది. పెద్దలింగాపూర్, రహీంఖాన్‌పేట, లక్ష్మీపూర్, కోడిముంజ గ్రామాలకు చెందిన 12 మంది దగ్గర నుంచి రూ 3.45లక్షలు వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్నారు. పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బండారి శంకర్ ఫిర్యాదు మేరకు బుధవారం ఇద్దరిని హైదరాబాద్‌లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పాలకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని జయ్యారం గ్రామ శివారులో బుధవారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరు మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల మేరకు.. కేశోరాం సిమెంటు కర్మాగారంలో కాంట్రాక్ట్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్న సందవెన గట్టయ్య (54) బసంత్‌నగర్ నుంచి తన స్వగ్రామమైన గోపాల్‌రావుపేటకు వెళుతుండగా మార్గమధ్యంలోని జయ్యారం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం: డీఐఈవో



-క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో అండర్-19 ఉమ్మడి జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జి. మధుజాన్సన్, ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు, అడిషనల్ ఎస్పీ, రీజినల్ విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంట్ ఆఫీసర్ అచ్చేశ్వర్‌రావు, టిజిఎంఎస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు సంపత్‌రావు, ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్, సరిత, సుజాత, శివ, అనూప్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో మగ బిడ్డకు జన్మనిచ్చిన ప్రయాణికురాలు



ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

అంతర్గాం అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎక్స్‌ప్రెస్(ఢిల్లీ-సికింద్రాబాద్)లో ఆగ్రా నుంచి కరీంనగర్ వెళ్తున్న సోమ స్వాతి బుధవారం రైలులోనే మగ బిడ్డకు జన్మనిచ్చింది. రైలు మందమర్రి వరకు రాగానే స్వాతికి పురిటి నొప్పులు రావడంతో స్పందించిన రైల్వే టీసీ 108 సిబ్బందికి సమాచారం అందించారు. రైలు రామగుండం చేరేలోగా 108 సిబ్బంది రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అప్పటికే స్వాతి ప్రసవం కావడంతో 108సిబ్బంది గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సీసీఐ బోణీ

- మొదటి రోజు 11.70క్వింటాళ్లు కొనుగోలు
- మద్దతు ధర రూ.7,270గా నిర్ణయించిన అధికారులు



మార్కెట్ యార్డులో పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

జమ్మికుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) బుధవారం బోణీ కొట్టింది. వరంగల్ జేడీఎమ్ వి శ్రీనివాస్, డిడిఎమ్ పద్మావతి, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, ఆర్డీవో రమేష్‌బాబు, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం, సీసీఐ సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన నల్లా రవీందర్‌రెడ్డి 11.70క్వింటాళ్ల విడి పత్తిని విక్రయానికి తీసుకు వచ్చాడు. సీసీఐ అధికారులు పరిశీలించగా 19శాతం తేమ వచ్చింది. తేమ ఎక్కువగా ఉన్నప్పటికి నాణ్యత బాగుండటంతో మార్కెటింగ్‌శాఖ అధికారుల వినతి మేరకు సీసీఐ రూ.7270.37మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. కాని సదరు రైతు వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దీంతో అతడి సమీప బంధువు అయిన వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వంగల వెంకట్‌రెడ్డి పేరిటా విక్రయించాడు. ఈ సందర్భంగా డిడిఎమ్ పద్మావతి మాట్లాడుతూ నాణ్యమైన పత్తి విక్రయానికి తీసుకు వచ్చి ప్రభుత్వ మద్ధతు ధర రూ.7521 పొందాలని రైతులకు సూచించారు. 8నుండి 12శాతం తేమ ఉన్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టుకోని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారి పాస్ బుక్, బ్యాంక్ పాస్‌బుక్, జిరాక్స్ ప్రతులను వెంట తీసుకు రావాలన్నారు. దళారులు, మధ్యవర్తులను నమ్మి రైతులు మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోని మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో ద్వితీయశ్రేణి కార్యదర్శి ఎస్ రాజా, అడ్తీదారులు రైతులు పాల్గొన్నారు.

ఒగ్గు కళ నుంచి సినీ రంగం వైపు..

- వరుస అవకాశాలతో రాణిస్తున్న మల్లేశం
- బ్రహ్మచారి సినిమాతో హీరోగా గుర్తింపు



మహిళ వేషధారణలో మల్లేశం

"కళారంగంపై ఉన్న ఆసక్తి ఆ యువకుడిని టాలీవుడ్ వైపు తీసుకెళ్లింది.. మొదట ఒగ్గు కళాకారుడిగా ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను కట్టిపడేసేవాడు. ఎక్కడ ప్రదర్శన ఇచ్చిన వందల సంఖ్యలో గుమిగూడేవారు. ఒగ్గుకథకుడిగా ప్రత్యేక గుర్తింపు రావడం, నటనపై ఉన్న ఇష్టంతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. వివిధ షార్ట్ ఫిలింలు రూపొందించి అప్‌లోడ్ చేశాడు. అవి సినీ పెద్దల దృష్టిలో పడడంతో సినీ రంగంలో అవకాశాలు వచ్చాయి. వివిధ ప్రాతలు పోషిస్తూ మంచి నటుడిగా గుర్తింపు పొందాడు."



షార్ట్ ఫిలింలో గొర్రెల కాపరి గెటప్‌లో గుంట మల్లేశం



బ్రహ్మచారి సినిమా పోస్టర్‌లో గుంట మల్లేశం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ మండలం ఫాజుల్‌నగర్ గ్రామానికి చెందిన గుంట మల్లేశంకు చిన్న తనం నుంచి కళారంగం అంటే ఇష్టం. కులవృత్తిలో భాగం గా తన తండ్రి ఒగ్గు కథలు చెబుతుండడం గమనించేవాడు. తండ్రి వద్ద ఒగ్గు కథలు చెప్పడం నేర్చు కున్నాడు. భావయుక్తంగా కథలు అల్లుతూ ప్రేక్షకు లను కట్టిపడేసేవాడు. ఒగ్గు కథల్లో ఆడ వేశధారణ మల్లేశంకు కళాకారుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. ఇలా ఒగ్గుకథలతో రాణిస్తున్న మల్లేశంకు షార్ట్ ఫిలింస్ తీయాలనే ఆలోచన వచ్చింది. జీఎం ఫోక్స్ పేరిట యూట్యూబ్ ఛానల్ ప్రారంభించాడు. చిన్న చిన్న కథలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడు. ప్రేక్షకుల మంచి ఆదరణ లభించింది. దీంతో 500కు పైగా షార్ట్ ఫిలింస్, 100కు పైగా ఫోక్ సాం గ్స్ చేశాడు. యూట్యూబ్ ద్వారా మల్లేశంకు సినిమా ల్లో అవకాశం లంబించింది. మందుగా 'సైన్యం' సినిమాలో రాజకీయ నాయకుడి కార్యకర్తగా సైడ్ క్యారె క్టర్‌గా చేశాడు. వరుసగా 'సైదులు, బద్మాష్' సిని మాల్లో పలు పాత్రల్లో నటించాడు. అనంతరం 'బ్రహ్మచారి' అనే కామెడీ సినిమాలో హీరోగా అవకాశం లభించింది.



హీరో సుమన్‌తో గుంట మల్లేశం

బ్రహ్మచారి సినిమాకు అవార్డు

బ్రహ్మచారి సినిమాను తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నంది అవార్డుకు ఎంపిక చేశారు. బ్రహ్మచారి సినిమాకు మొదటి షోతోనే మంచి పబ్లిక్ టాక్ వచ్చింది. దీంతో వరసగా మల్లే శంకు అవకాశాలు వస్తున్నాయి. 'రాజుగాడు రాజైతే, శివశంభో' సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నా డు. త్వరలో తీయబోయే 'బ్రహ్మచారి-2' సినిమాలో నటించనున్నాడు.

'నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

కరీంనగర్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే పట్టభద్రుల, ఉద్యోగ, ఉపాధ్యాయులు, నిరుద్యోగ యువత, విద్యార్థుల, విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తానని అల్ఫోర్స్ అధినేత, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో పలువురు పట్టభద్రులు, ఎలక్ట్రిసిటీ ఇంజనీర్లు, చార్టర్డ్ అకౌంటెంట్ల అసోసియేషన్ ప్రతినిధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 23: టీచర్ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ప్రభుత్వ ప్రైవేట్ ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ హైస్కూల్స్, జూనియర్ కళాశాలలకు వెళ్లి ఉపాధ్యాయులు, అధ్యాపకులను కలిసి ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలని కోరారు.

దీపావళి కవితల పోటీలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 23: తెలుగు పండితులు, పద్య కవి, శేషం విజయలక్ష్మీ నరసింహాచార్యుల స్మారక దీపావళి కవిత పోటీలకు కవితలను ఆహ్వానిస్తున్నట్లు శాంతికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా సామాజిక అంశంపై 25 పంక్తులకు మించని కవితను ఈ నెల 31వ తేదీ లోపు సాహితీవనం82జిమెయిల్.కామ్‌కు మెయిల్ చేయాలని పేర్కొన్నారు. వివరాలకు 9502236670, 9490805404 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహం చుట్టూ గోడ నిర్మాణం సరికాదు

సుభాష్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ గోడ నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువ జన సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం కోర్టు చౌరస్తాలోగల అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోంద న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపెల్లి సతీష్, ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్, రాష్ట్ర కార్యదర్శి కొమురయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేశ్ పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 23: క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ స్కూల్ గ్రౌండ్‌లో కరీంనగర్ క్రికెట్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 6 జట్లు పాల్గొని తలపడ్డాయి. ఇందులో రెండు జట్లు ఫైనల్‌కు చేరుకోగా ఫైనల్ టోర్నమెంట్‌కు మేయర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫైనల్ పోటీలో విజయం సాధించిన జట్టుకు క్రికెట్ ట్రోఫీని అందించి క్రీడాకారులను అభినందించారు. ఈ సంద



క్రికెట్ పోటీల విజేత జట్టుకు ట్రోఫీని అందిస్తున్న మేయర్ సునీల్‌రావు

ర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సమిష్టిగా పనిచేస్తూ క్రికెట్‌కు మళ్లీ గత వైభవాన్ని తెచ్చేందుకు కృషి చేయడం సంతోషమన్నారు. జిల్లా క్రికెట్ అసోయేషన్ తీసుకునే ప్రతి కార్యక్రమానికి మావంతు సహాయ సహకారాలు అందిస్తా మని మేయర్ సునీల్‌రావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సెయింట్ అల్ఫోన్స్ స్కూల్ అధినేత సంతోష్‌రెడ్డి, కరీంనగర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఆగంరావు, వైస్ ప్రెసిడెంట్ మహేందర్‌గౌడ్, సభ్యులు మనోహర్‌రావు, అజిత్‌రావు, సాగర్, తది తరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమో దుకు కరీంనగర్ మండలంలో మంచి స్పందన లభిస్తుందని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మాడిశెట్టి సంతోష్ అన్నారు. కరీంనగర్ మండలంలోని ఫకీర్‌పేట గ్రామంలో 84 బూత్‌లో బీజేపి సభ్యత నమోదు డ్రైవ్ కార్యక్ర మానికి ఆయన హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన బీజేపీ సభ్యత్వ నమోదును చేపించారు. అనంతరం మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పాలనతో నిరుపేదలకు లబ్ధి చేకూరు తుందన్నారు. బీజేపీ సభ్యత్వానికి స్పందన లభిస్తుందని తెలి పారు. కొంత మంది వారే స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో లింకు ద్వారా నమోదు చేసుకుం టున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల సభ్యత్వ నమోదు కో కన్వీనర్ దూడెం శ్రీనివాస్, గ్రామ బీజేపి నాయకులు బూత్ అధ్యక్షుడు సుద్దాల వెంకటేష్, వేల్పుల రాజు, వునుకొండ నరేందర్, సంజీవ్, మంద మరీష్, వేల్పుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయి శిక్షణకు కలెక్టర్, పారమిత సంస్థల ఒప్పందం

కరీంనగర్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్య సిస్తున్న విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు కలెక్టర్ పమేలా సత్పతి, పారమిత అధినేత ప్రసాదరావు మధ్య ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా శిక్షణ ఇప్పించేందుకు కలెక్టర్ బృహత్తర ప్రణాళికను సిద్ధం చేశారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో కలెక్టర్ పమేలాసత్పతి, పారమిత అధినేత ఇ.ప్రసాదరావు ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. పారమిత విద్యాసంస్థలచే ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎడ్, టెడ్ టాక్స్ నిపుణులచే ఈ ఒప్పందంలో భాగంగా శిక్షణ ఇవ్వనున్నారు. 20 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను జిల్లాస్థాయిలో ఎంపిక చేసి ఈ విద్యా సంవత్సరంలో వారికి పారమిత టెడ్ క్లబ్ చే శిక్షణ ఇస్తారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, భోజన, వసతి, గృహసదుపాయాలను కల్పిస్తారు. ఈ ఒప్పందం మూడేళ్ళు అమలులో ఉం టుందని ప్రకటిం చారు. ఒప్పందం చేసుకున్న తొలిరోజునే కన్నం వర్షిణి టెడ్ న్యూయార్క్‌లో పాల్గొనేందుకు వెళ్ళడం విశేషంగా భావించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారమిత పాఠశాలచే ఏర్పడిన టెడ్ వేదిక ద్వారా జిల్లాస్థాయి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శిక్షణ కార్యక్రమానికి ప్రైవేట్, పబ్లిక్ పాఠశాలల పార్ట్‌నర్‌షిప్ అనే ఆలోచనకు అంకురార్పణ జరిగిందన్నారు. జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు మాట్లాడుతూ వేదికలపై మాట్లాడటానికి విద్యార్థుల్లో ఉన్న భయాందోళనలు తొ లగించాల్సిన అవసరముందని, ఆ దిశగా టెడ్ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పారమిత టెడ్ క్యురేటర్ కె.హన్మంతరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చాటారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడతో శారీరక దేహదారుఢ్యాన్ని పెంపొందించు కోవచ్చన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాఠశాల విద్యార్థులు హర్షిత్, ప్రసన్న కుమార్, రవికార్తిక్, సుశాంత్, సంజన, హిరణ్య, తనీష్‌రెడ్డి, మేఘన అత్యుత్తమ ప్రతిభ చాటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

ఇండియన్ నేవీకి ఎంపికైన తేజస్ విద్యార్థులు

భగత్‌నగర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఇండియన్ నేవీలో సీనియర్ సెకండరీ రిక్రూట్స్ (ఎస్ఎస్ఆర్) అగ్నిపథ్ స్కీంకు తేజస్ డిఫెన్స్ అకాడమి విద్యార్థులు ఎంపికయ్యారు. బుధవారం కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తేజాస్ డిఫెన్స్, కళాశాల చైర్మన్ సిహెచ్ సతీష్‌రావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేజాస్ డిఫెన్స్ అకాడమి విద్యార్థులు పది మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. నవంబరు 7వ తేదీ నుండి చిల్కా ట్రైనింగ్ సెంటర్‌లో రిపోర్టు చేయాల్సి ఉందన్నారు.

జాతీయ రహదారి పనులు ముమ్మరం

(5వ పేజీ తరువాయి)

కోల్పోయిన బావులకు ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదు. ఎలబోతారం, నగునూర్, జూబ్లీనగర్ గ్రామాల్లో కొంత మంది నుంచి 15 రోజుల క్రితం సంతకాలు సేకరించిన అధికారులు ఇప్పటికీ డబ్బులు వేయలేదు. ప్రస్తుతం ఇరుకుల్ల నుంచి ఎలబోతారం, జూబ్లీనగర్‌కు రహదారి పనులు ప్రారంభం అవుతున్నాయి. పూర్తిస్థాయిలో నష్ట పరిహారం చెల్లించిన తరువాతే పనులు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ముగిసిన గంగుల లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు


లక్ష్మీనర్సమ్మ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు బుధవారం నగరంలోని సప్తగిరికాలనీ స్వర్గధామంలో ముగిశాయి. బుధవారం స్థానిక క్రిస్టియన్ కాలనీలోని స్వగృహంలో లక్ష్మీనర్సమ్మ భౌతికకాయాన్ని మాజీ మంత్రులు టి.హరీష్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మాజీ ఎంపీ బి.వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రవిశంకర్, గుజ్జుల రామకృష్ణారెడ్డి, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ల చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, సుడా మాజీ చైర్మన్ జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లహరిశంకర్ నివాళు లర్పించారు. అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఆయన సోదరులు గంగుల వెంకన్న, సుధాకర్‌తోపాటు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు.

'243 మంది కళాకారులతో గేయ కావ్యం'

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : 243 చరణాలున్న గేయ కావ్యాన్ని అంతేమంది కళాకారులతో పాడిస్తామని కవి, సినీ గేయ రచయిత, సంగీత దర్శకుడు వరంగల్ శ్రీనివాస్ అన్నారు. ఆయన రచించిన 'నూరేళ్ళ నా ఊరు' గేయ కావ్యం ఓయమ్మ నా పల్లె సీమ ఆలపించేందుకు కళాకారుల ఎంపిక మంగళవారం ఫిల్మ్ భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తామని అన్నారు. ఎంపిక కార్యక్రమంలో కళాకారులు బుర్ర సతీశ్‌గౌడ్, ఓరుగంటి శేఖర్, పొద్దుపొడుపు శంకర్, మల్లిక్ తేజ, తేలు విజయ, వొల్లాల వాణి, దేవయ్య, జూపాక శివ, గోల్కొండ బుచ్చన్న, గడ్డం రమేశ్, రామంచ భరత్, నక్క శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రహరీ కూల్చివేత

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 23: నగరంలోని హుస్సేనిపురా రోడ్ నెంబర్-8లో ఒకరు అనుమతికి విరుద్ధంగా నిర్మించిన ప్రహరీని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. బుధవారం ఉదయం 7గంటలకు మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పోలీసు బందోబస్తు మధ్య ఇంటి ముందు సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించుకున్న ప్రహరీని కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్ కాకుండా రోడ్డుపైనే ప్రహరీ నిర్మించుకోవడంతో కూల్చివేశామని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి సంధ్యారాణి తెలిపారు.

దినసరి కూలీ రక్తదానం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం కమీషనరేట్ కేంద్రంలో గన్నేరువరం మండలం జంగపల్లి గ్రామానికి చెందిన దినసరి కూలీ కోతి శ్రీనివాస్ (27) పాల్గొని రక్తదానం చేశారు. అయితే చేపలు పట్టుతూ, దినసరి కూలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న శ్రీనివాస్ తన భార్య, ఇద్దరు పిల్లలు ప్రియాన్స్, కూతురు ఆద్యలతో సహా కుటుంబ సమేతంగా గన్నేరువరం నుంచి కరీంనగర్ పోలీసు కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి చేరుకొని స్వచ్ఛందంగా రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. సీపీ అభిషేక్ మొహంతి శ్రీనివాస్ కుటుంబాన్ని తన కార్యాలయానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు కమీషనర్ వెంట ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

నియామకం

సుభాష్‌నగర్, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా మానుపాటి రవి, ప్రధాన కార్యదర్శిగా బిజిలి శ్రీనివాస్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు ఉత్తర్వులు జారీ చేశారు.

'ఈజీఎస్ కూలీలకు పని కల్పించేలా ప్రణాళిక'



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో సంజీవరావు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు వంద రోజులు పని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందిస్తామని ఎంపీడీవో సంజీవరావు అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మకల్, నగునూర్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులపై గ్రామ సభలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంపీడీవో సంజీవరావు హాజరై గ్రామాల్లో ముఖ్యమైన పనులను గుర్తించి తీర్మానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 6,608 మందికి జాబ్ కార్డులు కలిగి ఉన్నారన్నారు. ఉపాధిహామీ గ్రామ సభలో పనులను గుర్తించి, తీర్మాణం చేసి పంపించడం ద్వారా బడ్జెట్ ఆమోదానికి పంపిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇంకా ఎవరైనా ఉంటే జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జాబ్ కార్డు కలిగి ఉండి వ్యవసాయానికి సంబందించిన పనులను కూడా సొంత పనులకు నిధులు వినియోగించుకోవచ్చని తెలిపారు. పశువుల షెడ్లతో పాటు, పండ్ల తోటలు, పొలం గట్లపై మొక్కలు నాటడంతో పాటు వాటి ఖర్చు కూడా ఉపాధిహామి నిధులతోనే పెంచుకోవచ్చని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఉపాధిహామి నిధులను వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏపీఓ శోభరాణి, కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్, కార్యదర్శులు లచ్చయ్య, అహ్మదైతుల్ల, టీఎలు, ఎఫ్ఎలు, గ్రామ ప్రజా ప్రతనిధులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

ధూమపానంతో అనారోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న వివేకానంద విద్యార్థులు

గణేశ్‌నగర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధూమపానంతో అనారోగ్యం బారిన పడతారని జిల్లా పొగాకు నియంత్రణ సూపర్‌వైజర్ అండ్ సైకాలజిస్ట్ డి.రమణాకర్ అన్నారు. వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0లో భాగంగా బుధవారం విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

పారదర్శకంగా విచారణ జరిపించండి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను మున్సిపల్ కమిషనర్ చాహత్‌భాజ్‌పాయ్ దృష్టికి తీసుకెళ్ళేందుకు వెళ్ళిన తనను అవమానించడంతో ఆమెపై చేసిన ఫిర్యాదుపై పారదర్శకంగా విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని 44వ డివిజన్ కార్పొరేటర్ భర్త మెండి చంద్రశేఖర్ కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఆయన న్యాయవాది జక్కనపల్లి గణేశ్‌తో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 44వ డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తన భార్య మెండి శ్రీలత అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరిన విషయంలో మేయర్ సునీల్‌రావు కూడా తనను అవమానించారని తెలిపారు. ఈ రెండు సంఘటనలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, కమిషన్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారని, త్వరగా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

హిందూ శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించండి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా నగరంలోని అన్ని హిందూ శ్మశానవాటికల్లో మౌళిక సదుపాయాలను కల్పించాలని కార్పొరేటర్లు మున్సిపల్ అధికారులను కోరారు. బుధవారం కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, సరిళ్ళ ప్రసాద్, కాశెట్టిలావణ్య శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ చాహత్‌భాజ్‌పాయిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

కిట్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ ప్రథమ సంవత్సర విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల డై రెక్టర్ కందుకూరి శంకర్ హాజరయ్యారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

బాలలు, మహిళల హక్కులపై అవగాహన

హుజూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని ఐకేపీ కార్యాలయంలో బుధవారం మండల సమైఖ్య ఆధ్వర్యంలో బాలల, మహిళల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్టు శైలజ హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు.. సమావేశంలో ఫైనాన్స్ లిట్రసి రోహిణి, సోషల్ వర్కర్ రమేష్, అడిషనల్ డీఆర్‌డీవో సునీత, డీపీఎం రాధ, సుజాత, అరుణ పాల్గొన్నారు.

'సంఘ పటిష్టానికి సహకరించండి'

కరీంనగర్ టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-24 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు జీటీఏలో సభ్యత్వం తీసుకొని సంఘ పటిష్టతకు సహకరించాలని గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాసం ప్రభాకర్ కోరారు. బుధవారం నగరంలోని సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి మోతె చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా అత్యవసర సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జీటీఏపై అవగాహన కల్పించారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు జాన్ సుధాకర్, గౌరవ అధ్యక్షుడు గాజుల రవీందర్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, బి.అభిషేక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని విజయ్‌నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్లో ఓపెన్ జిమ్ పనులను బుధవారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి పురమల్ల శ్రీనివాస్ భూమి పూజ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఇష్తియాక్ అహ్మద్, కమిటీ అధ్యక్షుడు సాజిద్, ప్రధాన కార్యదర్శి మునీబ్, మాజీ ఎంపీటీసీ బద్రున్నిస పాషా, కరీంనగర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ షాహనవాజ్ ఉద్దీన్, మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు శభాస్ ఉల్ల ఖాన్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు

- రైతులు ఆందోళన చెందొద్దు
- తూకంలో ఇబ్బంది లేకుండా చర్యలు
- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


మల్లాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

తిమ్మాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తా మని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రామకృష్ణకాలనీ, నుస్తులాపూర్, బాల య్యపల్లి, మొగిళిపా లెం, పొలంపల్లి, నర్సింగాపూర్, మల్లాపూర్, మన్నెం పల్లి, పోరండ్ల గ్రామాల్లో బుధవా రం ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడిందని, తరుగు పేరిట రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండి పడ్డారు. ధాన్యం కొనుగోళ్ల పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అందులో భాగంగా ధాన్యం కొనుగోళ్ల ఏర్పాటును వేగవంతం చేసిందని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రైతులను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, నాయకులు ఎస్ఎల్ గౌడ్, తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, కుంట రాజేందర్‌రెడ్డి, పోలు రాము, కొత్త తిరుపతి రెడ్డి, పోలు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

హుజూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే రాష్ట్రం, దేశం బాగుపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, మెప్మా డీఎంసీ శ్రీవాణి, టీఎంసీ, మల్లేశ్వరి, ఆర్ఎం మదార్, మేనేజర్ అనిల్, ఆర్పీలు రమ, స్వరూప పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రిషన్ డే

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని లక్ష్మీనగర్ అం గన్‌వాడీ కేంద్రంలో అర్బన్‌హెల్త్ న్యూట్రిషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో సబితకుమారి మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హౌజింగ్‌బోర్డు యుపిహెచ్‌సి డాక్టర్ సాయి ప్రసాద్ కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్ర మంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయ, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.

ఖోఖోలో 'అద్విత' విద్యార్థిని ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్ అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)-68 జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన ఖోఖోలో అద్భుత ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి రన్నరప్‌గా అద్విత విద్యార్థిని రిషా నిలువిడం అభినందనీయమని అద్విత ఇం టర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సొగాని అనుదీప్ అన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలని తపాలా ఉద్యోగుల నిరసన

హుజూరాబాద్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరా బాద్ పట్టణంలోని తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగు లు తమ డిమాండ్లు నెరవేర్చాలని బుధవారం నల్లబ్యాడ్జీల తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరు ద్ధరించాలని కోరారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎనిమిదో వేతన కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అమర్నాథ్‌రెడ్డి, సీహెచ్ ప్రవీణ్, సందీప్, వేణుగోపాల్, శ్రీనివాస్, తిరుపతినాయక్, సత్యం, హరీష్, బి సతీష్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

శంకరపట్నం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభు త్వం మాదిగల వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగ నిరుద్యోగులకు అన్యాయం చేస్తుందని చెప్పారు.. ఉద్యోగ, విద్యా అవకాశాలలో నష్టపోయే విధంగా మాలలకు కొమ్ము కాస్తూ ఉద్యోగాల భర్తీ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 27న జగిత్యా లలో మాదిగల ధర్మయుద్ధ సన్నాహక సదస్సు నిర్వహిస్తు న్నామన్నారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. మాదిగలు, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు కనుకుంట్ల శ్రీనివాస్, నాయకులు కనకం అంజిబాబు, ఆడపు నర్సయ్య, తుంగ ఆంజనేయులు, కోడూరి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్

నాణ్యమైన విద్య అందించాలి

గన్నేరువరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి కుడిదల రామయ్య అన్నారు. మండల ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మండల కేంద్రంలోని పాఠశాలలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద తదితరులు పాల్గొన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్: హుజూరాబాద్ పోలీ స్‌స్టేషన్లో గురువారం ఓపెన్ హౌజ్ కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- హుజూరాబాద్ కేసీ క్యాంపులోని మహాత్మాగాంధీ విగ్రహం చుట్టూ ఉన్న పరిసరాలను సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ శుభ్రం చేశారు.

● వీణవంక: వీణవంక విద్యుత్ ఏఈగా బుధవారం రజిత బాధ్యతలు స్వీకరించారు.

● సైదాపూర్: ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామ మంచి నీటి సహాయకులకు శిక్షణ నిర్వహిస్తున్నారు.

● జమ్మికుంట రూరల్: హైదరాబాద్ లో శుక్రవారం తలపెట్టిన మహాధర్నా కార్యక్ర మానికి తరలి వెళ్లడం కోసం ముందస్తు అనుమతి కోరుతూ మేనేజర్ రాజిరెడ్డికి కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మి కులు బుధవారం వినతి పత్రం అందజేశారు

● గన్నేరువరం: మండలంలోని హన్మా జిపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రావణ్ ఇటీవల మృతి చెందగా ఆక్సిడెంటల్ పాలసీ తీసుకున్నందున ఎస్‌బీఐ గుం డ్లపల్లి బ్రాం చ్ సిబ్బంది 20 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అతడి తండ్రి వెంకటయ్యకు అందజేశారు.

- భద్రాచలంలో శుక్రవారం నుంచి ప్రా రంభించే మాలల మహా పాదయాత్ర కరప త్రాలను మండల కేంద్రంలో మాల మహా నాడు మండల అధ్యక్షుడు మల్లేశం ఆధ్వ ర్యంలో బుధవారం ఆవిష్కరించారు.

- మండలంలోని గుండ్లపల్లి స్టేజీ గ్రామం లోని రాజీవ్ రహదారి నుంచి గుండ్లపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వరకు సుడా నిధులతో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు

- మిల్లర్ల నుంచి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు బామండ్ల రవిందర్ బుధవారం తహసీల్దారు ఇప్ప నరేందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

● తిమ్మాపూర్: బీఆర్ఎస్ ఎల్పీ కార్య దర్శి మాదాడి రమేశ్‌రెడ్డి బుధవారం తన జన్మదినం సందర్భంగా మాజీ ముఖ్యమం త్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

● వీణవంక: మండలంలోని నర్సింగా పూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగులో తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్ర వేత్త విజయ్ తదితరులు పాల్గొన్నారు.